క్లుప్తంగా

వరి నారుమళ్లు పరిశీలన



ధర్మాజీగూడెంలో వరి నారుమళ్లు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

లింగపాలెం : లింగపాలెం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.సుజాత, డాక్టర్ ఫణికుమార్, ఎస్.నాగేంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా అధిక వర్షాలకు వరినారుమళ్లు కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట మండల వ్యవసాయాధికారి మురళీధర్, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి చందనోత్సవం



కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఉపాలయంగా కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామికి బుధవారం చందనోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పర్యవేక్షణలో వేదాంత పఠన పురోహితులు శరత్ శర్మ స్వామివారికి చందనోత్సవం చేశారు. భక్తులు రాతిపై అరగదీసి శ్రీచందనాన్ని సమర్పించారు. సుమారు 5 కేజీల చందనాన్ని స్వామివారికి అలంకరించారు. గురువారం స్వామివారికి అద్దిన చందనాన్ని ఒలిచి భక్తులకు ప్రసాదంగా అందిస్తామని అర్చకులు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కొయ్యలగూడెం పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు పౌష్టికాహారం ఔషధాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఏ.విశ్వనాథ శర్మ, కార్యదర్శి గోలిశెట్టి వాసు ఆధ్వర్యంలో మేటర్నల్, చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 55 మంది గర్భిణులకు రూ.25వేల విలువైన పోషకాహారం, ఔషధాలను అందించారు. వైద్యాధికారులు ఎస్తేరు రాణి, తస్లీమ్, ఎంపీహెచ్‌వో శ్రీరామరాజు మహిళలకు పరీక్షలు నిర్వహించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కుంచే వసంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మహాసభ తీర్మానాలు, కమిటీ ఎన్నికల వివరాలను పత్రికలకు విడుదల చేశారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో 25 మందితో నూతన సమితిని ఎన్నుకున్నట్లు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా బత్తుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కారం దారయ్య, ముళ్ళగిరి లాజరు, సహాయ కార్యదర్శిగా కూరాకుల బాబూరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం : టి.నరసాపురంలో ఇటీవల ఆయిల్‌పామ్ గెలలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై దొంత నాగేశ్వరరావు మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులకు బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు బీమా సొమ్ములో కొంత భాగాన్ని అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా రూ.5లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ముందుగా ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదును వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరపల్లి సీతారామప్రసాద్, పార్టీ మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు, జేసీబీ శ్రీను, వేముల ఏసుబాబు తదితరులు అందజేశారు.

భక్తుల ఇక్కట్లు

ద్వారకాతిరుమల: గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్రీవారి క్షేత్రంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక శాతం మంది భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్వామివారిని దర్శిస్తున్నారు. బుధవారం ఉదయం సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి విచ్చేసిన భక్తుల్లో కొందరు వర్షంలో తడుస్తూ ఆలయానికి చేరుకోగా, మరికొందరు గొడుగులు, తుండ్లు కప్పుకుని ఆలయంలోకి వెళ్లి, స్వామి అమ్మవార్లను దర్శించారు.

బాలల చట్టాలపై అవగాహన

లింగపాలెం : బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై సోషల్ వర్కర్ సీహెచ్ శ్రీకాంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లింగపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు హక్కులు, చట్టాలు, సంక్షేమం, దిశా వన్‌స్టాప్ సెంటర్ నుంచి అందిస్తున్న సేవలను అవగాహన కల్పించారు. బాలలు ఆపదలో ఉంటే వెంటనే బాలల సహాయవాణి 1098కి సమాచారం అందించాలని సూచించారు. చైల్డ్‌లైన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వైవీ రాజు, సిబ్బంది జాన్సన్ పాల్గొన్నారు.

వణికిస్తున్న వరద గోదావరి

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- బెంబేలెత్తుతున్న విలీనమండలాల ప్రజలు
- వర్షాలకు పొంగిపొర్లిన కొండవాగులు



పోలవరం రూరల్ : గుంజవరం గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న కాలువ

కుక్కునూరు : ఓవైపు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు.. మరోవైపు ఉధృతమవుతున్న గోదావరి వరద.. దీంతో విలీనమండలాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది జూలై నెలలో ఇదేవిధంగా గోదావరి వరద ఉప్పొంగడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు చిగురుటాకులా వణికిపోయాయి. దీంతో నిర్వాసితులు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ సంవత్సరం కూడా గత కొన్ని రోజులుగా తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతూ వచ్చిన గోదావరి మంగళ, బుధవారాల నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి 48.1 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు పడనున్నాయని వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో, గోదావరి వరద ఏ స్థాయిలో ఉంటుందోనన్న భయం విలీన మండలాల్లో నెలకొంది. దీనికి తోడు భారీ వర్షాలతో కొండవాగులు ఉప్పొంగుతున్నాయి. ఇప్పటికే గోదావరి వరద వాగుల్లోకి పోటెత్తడంతో మండలంలో పలు రహదారులు ముంపు బారిన పడ్డాయి.

పోలవరంలో 73.88 మి.మీ వర్షపాతం నమోదు

పోలవరం రూరల్ : ఈ ఏడాది పోలవరం మండలంలో తొలిసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. గుంజవరం, కొవ్వాడ, ఇసుక కాలువలు పొంగి ప్రవహించాయి. పోలవరం రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం ఉదయానికి 73.88 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంజవరం గ్రామ సమీపంలో రెండు కాలువలు ప్రధాన రోడ్డు మార్గంలో కొన్ని గంటల పాటు ఒకేసారి పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలువ రోడ్డుపై కూడా చెత్త కొట్టుకు వచ్చి నీరు దిగువకు వెళ్లకుండా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కొవ్వాడ కాలువ కూడా ఉధృతంగా పొంగి ప్రవహించింది. ఒకేసారి భారీ వర్షం కురవడం, కొవ్వాడ కాలువలో నీటి ఉధృతి పెరగడంతో స్లూయిజ్ గేట్లు పూర్తి స్థాయిలో ఎత్తకపోవడంతో కొవ్వాడ కాలువ ఎడమ గట్టుకు గండి పడింది. పంట పొలాలపైకి నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసిల్దార్ బి.సుమతి అధికారులతో మాట్లాడి స్లూయిజ్‌గేట్లు ఎత్తించడంతో కొవ్వాడ అధిక జలాలు పట్టిసం ఔట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి చేరాయి. పాత గుంజవరం గ్రామ సమీపంలో ఇళ్ల చుట్టూ కొంతసేపు నీరు చేరింది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పోలవరం మండలం ఎల్ఎన్ డీపేట గ్రామంలోని కొవ్వాడ రిజార్వయర్‌లో 87.38 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. పాపికొండల అభయారణ్య ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షపు నీరు క్రమేపీ రిజర్వాయర్‌లో చేరుతుంది. రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 90.50 మీటర్లు , రిజర్వాయర్‌లోకి మరింత నీరు పెరిగితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేసే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు.



పోలవరం రూరల్ : కొవ్వాడ కాలువ గట్టుకు పడిన గండిని ఇసుక బస్తాలతో పూడ్చుతున్న దృశ్యం



కామవరపుకోట : ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నిలిచిన ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల రాకపోకలు

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు, శ్రీనివాసపురం - తోటపల్లి గ్రామాల మధ్యలో తగిలే రేల వాగు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు కాలువల వద్దకు వెళ్లి పరిశీలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున దాటే ప్రయత్నాలు చేయరాదని సూచనలు చేశారు. వాగుల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం నుంచి గంట గంటకు వరద ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గంటకు 4వేల క్యూసెక్కుల వరద నీరు జలాశయంలో వచ్చి చేరుతోందని ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు తెలిపారు. జలాశయం నీటి మట్టం 82.50 మీటర్లు కాగా ప్రస్తుతం 79.60 మీటర్లకు చేరుకుందని ఏఈ తెలిపారు.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

కామవరపుకోట : మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోవడంతో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్‌ను నిలిపివేశారు. మంగళవారం రాత్రి తడికలపూడిలో జెర్సీ పార్లర్ సమీపంలో జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. తడికలపూడి ఎస్సై జయబాబు ఘటనా స్థలానికి చేరుకుని బుధవారం జేసీబీ సహకారంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. కళ్లచెరువు సమీపంలో గుండేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రమాదాలు జరగకుండా తడికలపూడి పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేశారు. వాగుపై నిర్మించిన బ్రిడ్జి గతంలో శిథిలావస్థకు చేరుకోగా, గ్రామస్తులు బ్రిడ్జి పక్కనే గ్రావెల్‌తో దారి ఏర్పాటు చేశారు. ఈ వర్షాలకు అది కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దంచికొడుతున్న వానలు

కొయ్యలగూడెం : రెండు రోజులుగా కురిసిన వానలకు మండలంలో పలు గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. అంకాలగూడెం కొత్తపేట పూర్తిగా ముంపునకు గురికావడంతో ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో ప్రధాన వాగులైన తూర్పు, పడమటి, బైనేరు, పులి వాగు, ఎర్రకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ముంపు బారిన పడ్డ ఇళ్లు కూలిపోతాయని వరద బాధిత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వేదాంతపురం, రామానుజపురం గ్రామాల మధ్య ఉన్న కనకరాజు చెరువు కళింగ నుంచి వరద నీరు రైతుల చేలను ముంచెత్తింది. మండల కేంద్రానికి చేరుకునే రహదారులు జలదిగ్బంధనం కావడంతో వంక బొత్తప్పగూడెం, మర్రిగూడెం, కిచ్చప్పగూడెం, బిల్లిమిల్లి, గిరిజన గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

కొట్టుకుపోయిన గుండెరు వంతెన

లింగపాలెం : ఆశన్నగూడెం శివారులో ఉన్న గుండేరు వంతెన మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ వంతెన నుంచి నిత్యం లింగపాలెం, కామవరపుకోట మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన కూలిపోవటంతో కామవరపుకోట మండలం వెళ్లాలంటే రంగాపురం నుంచి జీలకర్రగూడెం మీదగా వెళ్లాల్సి ఉంది. దీంతో సుమారు 10 నుంచి 20 కిలోమీటర్లు దూరం తిరిగి కామవరపుకోట వెళ్లాల్సి వస్తుంది. కొత్త వంతెన నిర్మించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు.

విస్తారంగా వర్షాలు

టి.నరసాపురం : మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. చింతల వాగు, జమ్మివాగు పొంగి పొర్లుతుండటంతో టి.నరసాపురం, మక్కినవారిగూడెం గ్రామాలమధ్య, మక్కినవారిగూడెం అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఆయా రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి.



టి.నరసాపురం : టి.నరసాపురం - మక్కినవారిగూడెం గ్రామాల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



జంగారెడ్డిగూడెం రూరల్ : పట్టెన్నపాలెంలో ఉధృతంగా జల్లేరు వాగు



కుక్కునూరు : వెంకటాపురం వద్ద నీటమునిగిన జామాయిల్ తోట



కొయ్యలగూడెం : ముంపు నీటిలో ఇబ్బంది పడుతున్న అంకాలగూడెం గ్రామస్తులు



కామవరపుకోట : ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరు వాగు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో వరద పరిస్థితిపై ఫోన్‌లో మాట్లాడుతున్న బాలరాజు

బుట్టాయగూడెం : భారీ వర్షాల కారణంగా గిరిజన ప్రాంతంలోని కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సూచించారు. భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పరిస్థితులు, తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో బాలరాజు ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో, ఆర్డీఓ, పోలీస్, విపత్తు, వ్యవసాయ, హార్టికల్చర్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అధికారులతో మాట్లాడి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వాగులు ఉధృతంగా ప్రవహించే చోట ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు సంక్షేమ లబ్ధి

చింతలపూడి : జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అంది వారికి న్యాయం జరుగుతుందని ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. ప్రగడవరం పంచాయతీ పరిధిలోని వెలగలపల్లి సచివాలయం-2 వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జానకిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఎలాంటి రుసుం చెల్లించకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన, మరణ, మ్యూటేషన్, రేషన్ కార్డులు, ఆధార్ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు నేరుగా వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి అందిస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను 99 శాతం నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ప్రతి ఒక్కరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, సర్పంచ్ టి.భూపతి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే షకీలా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

లింగపాలెం : జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకే వస్తున్నాయని చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానికిరెడ్డి అన్నారు. బుధవారం తోచలకరాయుడుపాలెంలో సర్పంచ్ పింగుల శోభారాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు మాట్లాడుతూ నవరత్నాలు పథకంలో భాగంగా ఎంతోమంది అర్హులు లబ్ధి పొందారన్నారు. అనంతరం అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, ఎంపీటీసీ పాదిల మరియమ్మ, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొఠారి మోహనరావు, ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏపూరి సూరిబాబు, రావి కొండయ్య, మండలపు నరసింహరావు, బేతిన మధు, పి బాబురావు, మండల ప్రత్యేకాధికారి ఏవీ ఆర్ గంగాధరబాబు, ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి : ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ జానకిరెడ్డి, ఎంపీపీ రాంబాబు



లింగపాలెం : లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ హరినాథ్‌రాజు



కొయ్యలగూడెం : గవరవరంలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



పోలవరం రూరల్ : చేగొండిపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

గవరవరంలో సురక్ష

కొయ్యలగూడెం : గవరవరం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. వెంకటపతిరాజు ఎడ్యుకేషనల్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఎంపీటీసీ బిరుదుగడ్డ రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీడీవో ఆర్.బేబీశ్రీలక్ష్మి, శీమకుర్తి సత్యనారాయణ, కసుకుర్తి వేణు, బొమ్మ రామకృష్ణ (శ్రీను), కోనాల వెంకట్రావు, కోనాల దివాకర్, ప్రగడ శివాజీ, దూలపల్లి రాయుడు, బిరుదుగడ్డ రవికిరణ్, మిరియాల వెంకటపతి పాల్గొన్నారు.

చేగొండిపల్లిలో సురక్ష

పోలవరం రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. చేగొండిపల్లి గ్రామంలో సర్పంచ్ జారం సీతారామలక్ష్మి అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులకు సాగు పట్టాలు, రేషన్ కార్డులు, లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వార్డులనూ అభివృద్ధి చేస్తాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- జంగారెడ్డిగూడెం మున్సిపల్ సాధారణ సమావేశం



మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం : పట్టణంలో అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలో అన్ని వార్డుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కాగా కౌన్సిలర్‌లు కె.లావణ్య, కె.రమాదేవి, కె.వాసవీరత్నం తదితరులు మాట్లాడుతూ వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని, వీధి లైట్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ పి.భవానీ ప్రసాద్ వివరణ ఇస్తూ పట్టణానికి సంబంధించి 500 ఎల్ఈడీ వీధిలైట్లు స్టాక్ వచ్చిందని, త్వరలో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో ఆయా గృహాలకు అవసరమైన బోర్లు వేసుకునేందుకు ఒకొక్క బోరుకు రూ.15 వేలు వసూలు చేస్తున్నారని, ఆ వసూలు నిలిపివేయాలని కౌన్సిలర్‌లు ఏవీ రమణమూర్తి కంచర్ల వాసవీ రత్నం, పీపీఎన్ చంద్రరావు కోరారు. అలాగే 19వ వార్డులో బోరు బావులు ఓపెన్‌గా ఉన్నాయని, వాటిని పూడ్చివేయాలని కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని కోరారు. పట్టణంలో కుక్కల బెడద తొలగించాలని పలువురు సభ్యులు కోరారు. ఇదిలా ఉండగా, బైనేరు వద్ద గల డంపింగ్ యార్డు నుంచి తీవ్ర దుర్గంధం వెలువడుతోందని, దీంతో ఆ ప్రాంత ప్రజలు నివసించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు కౌన్సిలర్‌లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చైర్‌పర్సన్, కమిషనర్ హామీ ఇచ్చారు. కాగా పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

- స్థానిక బుట్టాయగూడెం రోడ్డు నిర్మాణంలో 15వ ఆర్థిక సంఘం నిదులు రూ.62.31లక్షలతో కొంతమేర సీసీ రోడ్డు, మిగిలినది బీటీ రోడ్డుగా నిర్మించేందుకు రూ.1.10 కోట్లు సాధారణ నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.
- 25వ వార్డులో హెచ్‌డీటీఈ పైప్‌లైన్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయింపు
- 24వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 3.70 లక్షలు కేటాయింపు
- 14, 16, 17 వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 35 లక్షలు కేటాయింపు
- 5వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.11.20 లక్షలు కేటాయింపు
- శ్మశానవాటిక కాంపౌండ్ వాల్ విస్తరణకు, గేట్లు ఏర్పాటుకు రూ.19 లక్షలు కేటాయింపు
- శ్మశాన వాటిక వద్ద డంపింగ్ యార్డులో మేకల సంత ఏర్పాటుకు రూ.5 లక్షలు కేటాయింపు
- వీధి కుక్కల వాక్సినేషన్‌కు రూ. 5 లక్షలు కేటాయిస్తూ తీర్మానం.
- 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 లక్షలతో టెండర్ ఆమోదం
- 17వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3.50 లక్షలతో టెండర్ ఆమోదం
- 23, 24 వార్డులో డ్రెయిన్ నిర్మాణానికి రూ.8 లక్షలతో టెండర్ ఆమోదం

అమర వీరులకు నివాళి

కొయ్యలగూడెం : కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు బిరుదుగడ్డ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొని అమర జవానులకు నివాళులు అర్పించారు. 24 సంవత్సరాల క్రితం పాకిస్తాన్ సైనికులతో జరిగిన యుద్ధంలో మన సైనికులు 527 మంది ప్రాణత్యాగం చేశారని వారిని స్మరించుకోవడం భారతీయులుగా మన విధి అన్నారు.



కొయ్యలగూడెంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని ఎన్‌సీసీ విభాగం అమరవీరులకు జోహార్లు అర్పించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అమరవీరుల త్యాగఫలాన్ని గుర్తు చేసుకుంటూ భారతీయునిగా ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్గిల్ యుద్ధం అనే అంశం మీద ఆన్‌లైన్ క్విజ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ జి.జీవన మౌనిక తెలిపారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. స్థానిక స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచ్ నుంచి ప్రధాన రహదారుల మీదుగా ప్రభుత్వ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు చిలుకూరి సాయిబాబ మాట్లాడుతూ సైనికుల త్యాగాలను స్మరించుకోవడం మనవిధి అన్నారు. ఎక్స్ ఆర్మీ సభ్యులు ముసునూరి మాధవరావు, జూలూరి వీర రాఘవరావు, కార్యదర్శి కూచిబట్ల రాము, తిప్పాబోట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై నిందలు సహించం

కుక్కునూరు : మణిపూర్ అల్లర్లను కేంద్రం చాలా సీరియస్‌గా తీసుకొని రక్షణ వలయంగా అడుగులు వేస్తుందని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కుంజా వెంకట నరసయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ ఘటనా జరిగినా అది ఆర్ఎస్ఎస్, బీజేపీ పనేనంటూ బురద జల్లే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం లేని మిగతా రాష్ట్రాల్లో ఏదైనా ఘటనలు జరిగితే ఆ ప్రభుత్వమే చేయిస్తుందా అంటూ మండి పడ్డారు. విమర్శ చేసే ముందు నిజాలు తెలుసుకోవాలని, బీజేపీపై నిందలు వేస్తే సహించేది లేదని, తగిన గుణపాఠం చెప్పటానికి పార్టీ వెనకడుగు వేయదని హెచ్చరించారు. దేశానికి ఒకసారి ఎస్సీని, మరోసారి ఎస్టీని రాష్ట్రపతి చేసిన బీజేపీని విమర్శించే అర్హత కాంగ్రెస్, కమ్యూనిస్టు, మౌళిక వాదులకు లేదన్నారు. దేశంలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్రం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ఎస్ఈబీ దాడులు

చింతలపూడి : ఏలూరు సెబ్ అడిషనల్ ఎస్పీ నక్క సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. నాగిరెడ్డిగూడెం గ్రామంలో దాడులు జరిపి భూక్యా అరుణ అనే మహిళను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారాయి తయారీకి ఉపయోగించే 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎస్సై దుర్గాప్రసాద్, బాలాజీ, రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.